## క్లుప్తంగా

### వ్యక్తి అదృశ్యం


నడిపి లింగమయ్య (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట గ్రామానికి చెందిన ఉంద్రా నడిపి లింగమయ్య అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నెల 21న ఇతనికి జ్వరం రావడంతో కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు ఇతని భార్య తాగునీరు తెచ్చేందుకు బయటకు వెళ్లగా లింగమయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. ఘటనపై కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 90526 35446, 95422 80655 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని వారు కోరారు.

### తాగునీటి బోరు ఏర్పాటు

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలోని హరిజన కాలనీలోని ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా బోరు వేయించారు. కాలనీలో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ దృష్టికి తీసుకుపోగా ఆయన ప్రత్యేక దృష్టి సారించి కాలనీలో బోరు మంజూరు చేయించేందుకు కృషి చేశారు. ఈ మేరకు మంగళవారం కాలనీలో బోర్‌వెల్ వాహనంతో బోరు వేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచి భీమ, వైస్ ఎంపీపీ నరసింహులు తదితరులు ఉన్నారు.

### వెల్లివిరిసిన మత సామరస్యం


దేవరగట్టుకు వెళ్లే భక్తులకు ఆలూరు జామియా మసీదు వద్ద అన్నదానం

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాలకు వెళ్లే భక్తులకు అన్నదానం చేసి ఆలూరు ముస్లింలు మత సామరస్యం చాటుకున్నారు. మంగళవారం స్థానిక జామియా మసీదు సమీపంలో అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. గట్టుకు వెళ్లే 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. మత పెద్దలు హాజీ రజాక్, ఉస్మాన్, జహంగీర్ ఖాన్ ముస్లిం యూత్ సభ్యులు జీలాన్, ఖలందర్, బాషా తదితరులు ఉన్నారు.

### విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఏఈ లోకేష్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది పెండింగ్ బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. ఈ నెలాఖరులోగా నెల వారీ బిల్లులతో పాటు బకాయిలను వసూలు చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. రైతులు స్వంతంగా ఫ్యూజులు, స్టార్టర్లను మరమ్మతులు చేయరాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం దళారులను ఆశ్రయించవద్దని, విద్యుత్ సమస్యలపై 94408 13390 నంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు.

### సాయి ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాకు హారతి ఇస్తున్న పూజారి

మద్దికెర: స్థానిక షిర్డీ సాయినాథుని ఆలయంలో సోమవారం 10వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరనామార్చన, క్షీరాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం సమర్పణ చేశారు. పూజలకు విచ్చేసిన ప్రవాస భారతీయులు, దాత అర్ధగేరి సీతారామిరెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. భక్తులకు అన్నదాన, ప్రసాదం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, విజయ్‌ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన క్రికెట్ టోర్నీ

హాలహర్వి: దసరా సంబరాల్లో భాగంగా మండలంలోని అర్ధగేరి గ్రామంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. టోర్నీ ఫైనల్‌లో అర్ధగేరి, గూళ్యం జట్లు తలపడ్డాయి. అర్ధగేరి జట్టు విజయం సాధించడంతో మొదటి బహుమతి రూ.10 వేలు, మొమెంటోను చింతకుంట సొసైటీ చైర్మన్ అర్ధగేరి శ్రీనివాసులు, రెండో బహుమతిని అర్జున్‌రెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అర్ధగేరి సర్పంచ్ గురుదాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

### ఊరేగింపులో ఘర్షణ

పత్తికొండ రూరల్: పత్తికొండ కుమ్మరివీధిలో సోమవారం రాత్రి దుర్గామాత ఊరేగింపులో ఘర్షణ చోటుచేసుకుంది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న సమయంలో వివాదం జరిగి కొందరు యువకులు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించడంతో వివాదం సద్దుమనిగింది. ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.


కటారుకొండలో అమ్మవారిని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


ఆస్పరిలో గంగ పూజకు వెళ్తున్న భక్తులు


రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

# ఘనంగా విజయదశమి ఉత్సవాలు

తుగ్గలి: దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు, జమ్మి చెట్టుకు శమీ పూజ నిర్వహించారు. పిల్లలు జమ్మి ఆకులు అందించి పెద్దల ఆశీర్వాదం పొందారు. నవరాత్రుల సందర్భంగా భక్తుల నుంచి విశేష పూజలందుకున్న విజయదుర్గ అమ్మవారు విజయదశమి రోజున నిమజ్జనానికి తరలివెళ్లారు. సోమవారం దసరా ప్రత్యేక పూజల అనంతరం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమలను ట్రాక్టర్‌లో ఉంచి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. యువకుల నృత్యాలు, కేరింతలతో ఊరేగింపు సందడిగా సాగింది. అనంతరం చెరువులో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి విగ్రహ మహోత్సవం వేలాది మంది భక్తుల హర్షధ్వానాల మధ్య మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి 10 గంటల వరకు అత్యంత వైభవంగా సాగింది. తిరుమల వేంకటేశ్వర స్వామి తరహాలో ఇక్కడి చెన్నకేశవస్వామికి తొమ్మిది రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం నిర్వహించిన విగ్రహ మహోత్సవానికి కందనాతి, మసీదపురం, వెంకటగిరి, మాచుమాన్‌దొడ్డి గ్రామల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాలుగు గ్రామాల ప్రజలు నాలుగు వైపులా విగ్రహ పల్లకీని మోశారు. కొండపై నుంచి కిందకు స్వామివారిని తీసుకొచ్చే ప్రయత్నంలో అవస్థలు పడ్డారు. మిద్దెలపై నుంచి పెద్ద పెద్ద తాళ్లతో కట్టి విగ్రహం కిందకు పడకుండా జాగ్రతలు పడ్డారు. స్వామి పల్లకీని గ్రామ పొలిమేరలోని జమ్మి చెట్టు వద్దకు తీసుకెళ్లి పూజలు చేసి తిరిగి కొండపైకి చేర్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్‌ఐ యు.నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. మహోత్సవం సందర్భంగా గ్రామంలో కోలాటాలు నిర్వహించారు.



దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, పల్లకీలో సతీసమేతంగా ఊరేగుతున్న శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సోమవారం విజయదశమి పండుగను పురస్కరించుకొని అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారు, శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ప్రదక్షిణలు చేశారు. అనంతరం శమీపూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హొళగుంద: దేవరగట్టు శ్రీమాళమల్లేశ్వర స్వామిని మంగళవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. ఆయన సోదరులు దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ, పార్టీ నాయకులతో కలిసి వచ్చిన మంత్రికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నందవరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవికి ప్రత్యేకాలంకరణలో రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో ఆది దంపతులకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చనలు, నమక చమక పూజలు గావించారు. భక్తులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులు శమీ వృక్షానికి పూజలు చేపట్టారు.అలాగే టి.సోమలగూడూరులో పెద్దమ్మవ్వ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నందవరంలో బంగారమ్మవ్వ, మారెమ్మవ్వ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేకాలంకరణ గావించి పూజలు చేశారు.

హొళగుంద: మండలంలో మంగళవారం దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి, హొళగుందలోని వీరభద్రేశ్వర, సిద్ధేశ్వర స్వామి తదితర ఆలయాలలో జలాభిషేకం, రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. దేవుళ్లకు పిండివంటలు నైవేద్యంగా పెట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హొళగుందలో సాయంత్రం రాజ వారసుడిని అశ్వంపై కూర్చోబెట్టి బంగారు ఖడ్గంతో పురవీధుల గుండా గ్రామ శివారులోని శమివృక్షం వరకు ఊరేగింపు నిర్వహించారు


కందనాతిలో పూజలందుకుంటున్న చెన్నకేశవ స్వామివారు


గురజాలలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు


దేవరగట్టులో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ విరుపాక్షి


పార్లపల్లిలో ఊరేగింపుగా జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న గ్రామస్తులు


హొళగుందలో రాజ వంశస్తుడిని బంగారు ఖడ్గంతో అశ్వంపై ఊరేగిస్తున్న దృశ్యం


నిట్రవట్టిలో కోలాటం ఆడుతున్న దృశ్యం

## తాగునీటి ఎద్దడి తీర్చండి


ఆలూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న అరికెర గ్రామస్తులు

ఆలూరు: అరికెర గ్రామానికి హాలహర్వి, విరుపాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి గత 20 రోజులుగా తాగునీటిని విడుదల చేయకపోవడంతో గ్రామస్తులు సోమవారం ఆలూరులో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా సీపీఎం నాయకులు నారాయణస్వామి, మండల సీపీఎం కార్యదర్శి షాకీర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులకు గుక్కెడు తాగునీరు సరఫరా చేయకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. వెంటనే గ్రామానికి తాగునీటిని సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

## బన్ని ఉత్సవంలో పటిష్ట బందోబస్తు


సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అడిషనల్ ఎస్పీ

హొళగుంద: బన్ని ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కలిసి పోలీసులు, ప్రత్యేక బలగాలు, రోబో పోలీసులు, మహిళా పోలీసులు, ఆర్మీ, సెకండ్ పార్టీలతో బందోబస్తు నిర్వహించారు. వారికి అరికెర అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. బందోబస్తు నిర్వహించే సిబ్బందికి అడిషనల్ ఎస్పీ నాగబాబు, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పలు సూచనలిచ్చి దిశానిర్దేశం చేశారు. ఉత్సవంలో అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించడానికి 100కు పైగా సీసీ, డ్రోన్, వీడియో కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు వినియోగిస్తున్నామని, అలాగే పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## వాటర్ ప్లాంటు ప్రారంభం


వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న ప్రవాసభారతీయులు సీతారామి రెడ్డి

మద్దికెర: గ్రామాభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రవాస భారతీయులు అర్ధగేరి సీతారామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో ఆయన తల్లిదండ్రులు అర్ధగేరి రామకృష్ణరెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత మంచినీటి అందించడమే తమ లక్ష్యమన్నారు. మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, విజయ్ ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్రాల పారువేట అదుర్స్


విజయం సాధించిన అశ్వంపై వేమనగరి కుటుంబీకులు

మద్దికెర: విజయదశమి పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన గుర్రాల పారువేట అశేష జనవాహిని మధ్య కనులపండువగా సాగింది. పారువేటలో వేమనగిరి యాదవరాజులు జగదీల్ రాయుడు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దనగిరి, చిన్న నగిరి, వేమనగిరి కుటుంబాలకు చెందిన యాదవ వంశీకులు రాజదుస్తులతో ఠీవిగా గుర్రాలపై కూర్చోగా, వారి వెంట ఆయుధాలు ధరించిన సైనికులు ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని రాగిమాను కట్ట వద్దకు వచ్చారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో బొజ్జనాయుని పేట గ్రామంలో వున్న భోగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన గుర్రాల పారువేటలో వేమనగిరి కుటుంబానికి చెందిన వారు ముందుగా మద్దికెరకు చేరుకొని విజయం సాధించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిలో అశేష జనవాహిని మధ్య విజయం సాధించిన అశ్వాన్ని ఊరేగించారు. పెద్ద ఎత్తున ప్రజలు, యాదవరాజ వంశీకులు రాజన్నయాదవ్, నీలకంఠరాయుడు, జయరామరాజు, ఈశ్వర రాయుడు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రిజ్వాన్ మహమ్మద్ బందోబస్తు నిర్వహించారు.


చేతిపై నుంచి వెనక్కి పల్టీ కొడుతున్న యువకుడు


శరీరంపై కడ్డీలు గుచ్చుకొని ఒక పెద్ద, రెండు చిన్న గ్యాస్ సిలిండర్లను ఎత్తుతున్న యువకుడు


ఇనుప కత్తులపై పడుకొని వీపుపై బండరాయిని పగలగొట్టించుకుంటున్న యువకుడు


యువకుల విన్యాసం

## కడ్డీలు గుచ్చుకొని.. కత్తులపై పడుకొని !

### అబ్బురపరిచిన గుడేకల్ గ్రామ యువకుల విన్యాసాలు

వీపునకు కడ్డీ గుచ్చుకుని బండి చక్రాన్ని ఎత్తడం.. గ్యాస్ సిలిండర్లను పైకి లాగడం.. జేసీబీకి పైపు కట్టి వేలాడటం.. కత్తులపై పడుకుని బండరాయిని పగలగొట్టించుకోవడం.. కర్రసాము, కుస్తీలు, పల్టీలు కొట్టడం.. ఇలాంటి సాహస విన్యాసాలన్నీ ఎక్కువగా సినిమాల్లో చూస్తాం. అయితే ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామానికి చెందిన చింతమాన్‌గల్లీ, రామమ్‌గల్లీ, గచ్చిన్‌గల్లీ యువకులు రియల్‌గా చేసి అబ్బురపరిచారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ విన్యాసాలను దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం ప్రదర్శించారు. ప్రమాదమని తెలిసినా ఏటా విజయదశమికి గ్రామంలో ఇలాంటి విన్యాసాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

– ఎమ్మిగనూరు రూరల్

## ఆటో బోల్తా - బాలుడి మృతి


మృతిచెందిన సురేంద్ర

గుత్తి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన సురేంద్ర (13)ను వెంట బెట్టుకుని అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు చెరువు తండా గ్రామానికి వెళ్లాడు. టమాట దిగుబడులు లోడు చేసుకుని తిరిగి ఎర్రగుడికి బయలుదేరిన వారు చెరువు తండా శివారులోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు, సురేంద్రను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం తిరిగి గుత్తి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి తుగ్గలి పోలీసులకు బదిలీ చేశారు.

### నేడు కృష్ణగిరికి ఎమ్మెల్యే రాక

కృష్ణగిరి: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించనున్న సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొననున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరుకావాలని కోరారు. అనంతరం ఎరుకలచెర్వులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని వెల్లడించారు.

### నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మద్దికెర: మద్దికెరలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మద్దమ్మకుంట వద్ద పూజలు నిర్వహించి బోర్లు వేసే పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో బోర్లు వేసేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బోర్‌వెల్ వాహనాన్ని పంపారని చెప్పారు. అవసరమైన చోట్ల 5 బోర్లు వేసేందుకు అవకాశం కల్పించారని వివరించారు. బోర్లు వేసి ట్యాంకులు ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. నాయకులు శ్రీనివాసులు, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


జొన్నగిరి వద్ద ప్రమాదంలో మృతి చెందిన పద్మావతి

తుగ్గలి: మండల పరిధిలో మంగళవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పత్తికొండ నుంచి గుత్తి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటోను జొన్నగిరి సబ్ స్టేషన్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరు వ్యాపారి గుత్తి దాసరి కాలనీకి చెందిన ముక్త పద్మావతి (55) అక్కడికక్కడే మృతి చెందగా అదే కాలనీకి చెందిన చిరువ్యాపారులు మరో నలుగురు మహిళలు గాయపడ్డారు. గాయపడ్డవారిని 108 అంబులెన్స్‌లో గుత్తి ఆసుపత్రికి తరలించారు. జీఎర్రగుడి సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన చెర్వు రంగనాయకులు ఆటోలో తోటకు వెళుతుండగా గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న కుమారుడు సురేంద్ర (12) ఆటో నుంచి జారిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఆయా ప్రమాదాలపై విచారణ చేస్తున్నట్లు జొన్నగిరి పోలీసులు తెలిపారు.

### కోలుకోలేక వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి చెందిన మాల నడవలయ్య (27) అనే వ్యక్తి ప్రమాదంలో గాయపడి కర్నూలులో ఓ ప్రైవేటు హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. గుడేకల్‌కు చెందిన మాల నడవలయ్య (27) నందవరం మండలం ముగతి గ్రామ సమీపంలోని పత్తి మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం నందవరం మండలం హాలహర్వి గ్రామానికి వెళ్లి సోమవారం రాత్రి బైక్‌పై తిరిగివస్తుండగా పట్టణ సమీపంలోని శివమూర్తి కాటన్ మిల్లు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య మాల జయలక్ష్మీ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

### గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


శివన్నగౌడ్ (ఫైల్)

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో నివసిస్తున్న మోహన్‌గౌడ్, లక్ష్మి దంపతుల రెండో కుమారుడు శివన్నగౌడ్ (14) మృతదేహం లభ్యమయ్యింది. వివరాల్లోకి వెళితే.. విద్యార్థి శివన్నగౌడ్ ఆదోనిలోని నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో గ్రామానికి వచ్చాడు. సోమవారం పొలంలో పనిచేస్తున్న కుటుంబీకులకు సద్ది (క్యారియర్) ఇచ్చేందుకు వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత అక్కడున్న ఎల్లెల్సీ కాలువలో నీరు తాగేందుకు వెళ్లగా జారి కాలువలో పడి కొట్టుకుపోయాడు. అక్కడున్న వారు కాలువలో దూకి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరుసటి రోజు శివన్నగౌడ్ మృతదేహం బయటపడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### గుర్తు తెలియని మృతదేహం..

పత్తికొండ రూరల్: పత్తికొండ–హోసూరు రోడ్డులోని హంద్రీ నీవా కాలువ సమీపంలోని వంక వద్ద మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బట్టి చూస్తే ఎవరో హత్య చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మహత్య? లేకా హత్య పూర్తి వివరాలు తెలియల్సి ఉంది. సమీప పొలాల రైతులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మురళీమోహన్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.